WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 226 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 11 ఆగస్టు 2025 | వెల : 2-00



# టాప్3 దిశగా భారత్

- దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగతి
- ట్రంప్‌కు మోదీ పరోక్ష కౌంటర్
- ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక
- భారత్ సాంకేతికత, మేకిన్ ఇండియా
- ప్రపంచంతో పోటీపడడమే కాదు..
- నాయకత్వం కూడా వహించాలి: మోదీ
- బెంగళూరు మెట్రో ఫేజ్-3కు శంకుస్థాపన..
- ఎల్లో లైన్ సేవలు షురూ
- 3 వందేభారత్ రైళ్లు జాతికి అంకితం
- మెట్రోలో విద్యార్థులతో మోదీ ముచ్చట

స్వర్ణసాగరం, బెంగళూరు

భారత ఆర్థిక వ్యవస్థను 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన విమర్శలకు ప్రధాని మోదీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలో టాప్-3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కౌంటర్ ఇచ్చారు. సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే స్ఫూర్తి నుంచి ఈ వేగం వచ్చిందన్నారు. స్పష్టమైన ఉద్దేశం, నిజాయితీ ప్రయత్నాలతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరులో మెట్రో ఫేజ్-3 పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక భారత సాంకేతిక పరిజ్ఞానం, మేక్ ఇన్ ఇండియా శక్తి దాగున్నాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ పోటీ పడటమే గాక నాయకత్వం కూడా వహించాలని ఆకాంక్షించారు. మన నగరాలు స్మార్ట్‌గా, వేగంగా, సమర్థంగా ఉన్నప్పుడు మాత్రమే మనం అభివృద్ధి చెందుతామని అన్నారు. 21వ శతాబ్దంలో నగర ప్రాజెక్టులు, నగరాల మౌలిక సదుపాయాలు అత్యంత అవసరమని అన్నారు. 11 ఏళ్ల క్రితం ఆర్థిక పరంగా దేశం పదోస్థానంలో ఉండేదని, ప్రస్తుతం నాలుగో స్థానానికి ఎదిగిందని అన్నారు.

**ఈ మూడు రంగాల్లో వేగంగా వృద్ధి**

2014 నాటికి మన దేశంలో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైల్వే సేవలు పరిమితంగా ఉండేవని మోదీ పేర్కొన్నారు. ఇప్పుడు 24 నగరాల్లో 1000 కిలో - మిగతా3లో

## 'అడవితల్లి బాట' పనులు వేగవంతం

### అధికారులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశం



స్వర్ణసాగరం అమరావతి

'అడవితల్లి బాట' పనులను వేగవంతం చేయాలని, సవాళ్లు ఎదురైతే ప్రణాళికాబద్ధంగా అధిగమించాలని పంచాయతీ అధికారులను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలపై ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకమిషనరు, ఇంజినీరింగు అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. అడవితల్లి బాట ప్రోగ్రామ్ ద్వారా 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పాటవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని, రెండు వారాలకు ఒకసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పిఎం జన్‌మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1,005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. అడవితల్లి బాట పేరుతో రెండు దశల్లో చేపట్టిన పనుల్లో స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం-డోలీ రహిత గిరిజన ఆవాసాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. అటవీశాఖ నుంచి రావాల్సిన అనుమతులపై త్వరలోనే శాఖతో సమీక్ష నిర్వహించి ఆ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయిస్తామని తెలిపారు.

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది:

### జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్


3

## ఈ చిన్నారులు కనిపించలేదా?



- పీ-4 సర్వేలో అధికారుల నిర్లక్ష్యం
- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ముగ్గురు పిల్లలు
- తమ్ముడు, చెల్లి కోసం కూలికి వెళ్తున్న అక్క
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు





## రాహుల్ గాంధీకి కర్నాటక ఎన్నికల అధికారి నోటీసులు!

- ఆరోపణలకు సంబంధించి డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాలి
- మహదేవపుర నియోజకవర్గంలోనే నకిలీ ఎంట్రీలు, ఫేక్ అడ్రస్‌లు, ఒకే చోట రిజిస్ట్రేషన్ ద్వారా 1,00,250 ఓట్లు దొంగిలించారు
- ఈసీఐ డేటా ఆధారంగా 70 సంవత్సరాల ఓటరు శకున్ రాణి రెండుసార్లు ఓటు వేశారన్న రాహుల్ ఆరోపణలపై నోటీసుల్లో పేర్కొంది.
- సీఈవో కార్యాలయం ప్రాథమిక విచారణలో ఆమె ఒకేసారి మాత్రమే ఓటు వేసిందని పేర్కొంది

హంద్రీ-నీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లతో

## మనసు పులకరిస్తోంది

- రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు
- ప్రతి ప్రాజెక్టు నిండేలా, ప్రతి చెరువుకు నీరందేలా, చివరి భూములను సైతం తడిపేలా, హంద్రీ-నీవా కాల్వల్లోని నీటి ప్రవాహం
- రికార్డు సమయంలో కాల్వల విస్తరణ చేపట్టిన కారణంగానే ఈ సీజన్‌లో చివరి భూములకు నీరందించాలనే మా కల



స్వర్ణసాగరం అమరావతి

రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి మనసు పులకరిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి ప్రాజెక్టు నిండేలా, ప్రతి చెరువుకు నీరందేలా, చివరి భూములను సైతం తడిపేలా, హంద్రీ-నీవా కాల్వల్లోని నీటి ప్రవాహం రైతన్నల ఆశలను, ఆకాంక్షలను తీరుస్తోందని చెప్పారు. రికార్డు సమయంలో కాల్వల విస్తరణ చేపట్టిన కారణంగానే ఈ సీజన్‌లో చివరి భూములకు నీరందించాలనే మా కల సాకారమవుతోందని తెలిపారు. రైతుల సంతోషం మా సంకల్పానికి మరింత బలాన్నిస్తోందని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

## లిక్కర్ స్కాంలో భూమన



స్వర్ణసాగరం తిరుపతి

'గత వైసీపీ హయాంలో పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబరులోగా శుభ్రం చేయిస్తాం. ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారు' అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'లిక్కర్ స్కాంలో వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికి కూడా సంబంధం ఉన్నట్టు తెలిసింది. ఆయన సన్నిహితులు మద్యం కుంభకోణంలో ఉన్నట్టు పేర్లు బయటకు వచ్చాయి. త్వరలోనే భూమనను కూడా విచారించే అవకాశం ఉంది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో భూమన లాంటి చీడపురుగులను సమాజం నుంచి ఏరిపారేస్తాం. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా..భూమన తన పద్ధతి మార్చుకోలేదు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, అక్రమాలు ఆధారాలతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తండ్రి, కొడుకు(కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డి)లు ఒకే జైలులో ఊచలు లెక్కపెట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు

## ట్రంప్‌కు ప్రధాని మోదీ కౌంటర్!

- ప్రపంచంలో భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఎంతో సమయం పట్టదంటూ స్పష్టం
- భారత్ మూడో ఆర్థిక శక్తి కాబోతుందంటూ
- రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనేవి భారత్ ఆర్థికంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి
- 'గత 11 ఏళ్లలో భారత ఆర్థికంగా బలోపేతమైంది
- 10వ స్థానం నుంచి 5 స్థానానికి వచ్చాం.




# సస్పెన్షన్ ఆర్డర్ జారీ చేసిన ఐజీ అధికారి..

## కోర్టులో వాదనలు వినిపించిన కూతురు.. ఎవరిది గెలుపు?



**ఇంటర్నెట్ డెస్క్:** విధినిర్వహణలో రక్తసంబంధాలకు, అనుబంధాలకు స్థానం వుండకూడదు. వృత్తిపరంగా తన బాధ్యతలను నిర్వహించినప్పుడే వారు తమ వృత్తికి న్యాయం చేయగలుగుతారు. ఓ కానిస్టేబుల్ పై పోలీసు అధికారి సస్పెన్షన్ ఉత్తర్వును జారీ చేయగా.. కానిస్టేబుల్ తరఫున న్యాయవాదిగా ఆ అధికారి కుమార్తె కోర్టులో వాదనలు వినిపించగా.. బాధితుడి సస్పెన్షన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఆమె తన తండ్రిపై విజయం సాధించినట్టయింది. ఈ అరుదైన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఆ కేసు వివరాల్లోకి వెళ్తే.. 2023 జనవరి 13న ఫిలిబిత్‌కు చెందిన ఓ బాలికను రైలులో వెళుతుండగా లైంగిక వేధింపులకు గురిచేశారనే ఆరోపణలతో పోలీసు కానిస్టేబుల్ తౌఫిక్ అహ్మద్‌ను సర్వీస్ నుంచి తొలగించారు. అప్పుడు బరేలిలో ఐజీ రాకేశ్ సింగ్(ప్రస్తుతం పదవి విరమణ చేశారు) అధికారిగా ఉన్న సమయంలో ఆ కానిస్టేబుల్‌పై ఈ చర్యలు తీసుకున్నారు. దీనిపై అహ్మద్ తన సస్పెన్షన్ ఎత్తివేయాలని అలహాబాద్ హైకోర్టులో సవాలు చేయగా..అతని తరఫున ఐజీ కుమార్తె అరుణా సింగ్ వాదించింది. జస్టిస్ అజిత్ కుమార్‌తో కూడిన ధర్మాసనం లాయర్ అరుణా సింగ్ వాదనలతో ఏకీభవించి అహ్మద్ సస్పెన్షను కొట్టివేసింది. అలాగే తనని విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల్లోగా మళ్లీ విచారణ జరిపి పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే తన తరఫున వాదించిన న్యాయవాది ఐజీ కుమార్తె అని తెలియదని చెప్పడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. తన కూతురు వృత్తి పరంగా నిబద్ధత కలిగి ఉన్నందుకు గర్వంగా ఉందని అధికారి సింగ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తన కూతురు లాయర్‌గా సాధించిన విజయం తనకు గొప్ప విషయం అని తెలిపారు. విచారణలో కొన్ని లోపాలు జరిగాయన్నారు. " నేను, మా నాన్న వృత్తిపరంగా తమ బాధ్యలను నిర్వర్తించాం. నేను ఓ లాయర్‌గా నా క్లయింట్ తరఫున పోరాడాను. అలాగే మా నాన్న కూడా ఓ అధికారిగా తన బాధ్యతను నిర్వర్తించారు" అని అరుణాసింగ్ తెలిపారు.

# భారత్‌పై ట్రంప్ సన్నిహితుడి వివాదాస్పద వ్యాఖ్యలు




**వాషింగ్టన్:** రష్యా-భారత్ వాణిజ్యంపై అమెరికా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక సహాయకుడు స్టీఫెన్ మిల్లర్.. భారత్‌పై సంచలన ఆరోపణలు చేశారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌పై ఆ దేశం చేస్తున్న యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. యుద్ధం ఆగాలంటే భారత్‌పై ఆంక్షలు తప్పవని తేల్చి చెప్పారు. దీంతో, ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక సహాయకుడు స్టీఫెన్ మిల్లర్ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్ వాణిజ్యం కారణంగానే రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తోంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తూ యుద్ధానికి ఆర్థికంగా మద్దతు ఇవ్వడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే విషయంలో భారత్ దాదాపుగా చైనాతో సమానంగా ఉంది. భారత్ చేసుకుంటున్న దిగుమతులు ఉక్రెయిన్‌పై రష్యా దాడికి నిధులు సమకూర్చడానికి సాయపడుతున్నాయి. ఇది అమెరికా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంది. ఈ విషయంలో అధ్యక్షుడు ట్రంప్ చాలా స్పష్టతతో ఉన్నారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇక, ఆయన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. అయితే, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు కీలక భాగస్వామి అయిన భారత్‌పై ట్రంప్ వర్గం నుంచి ఇలాంటి విమర్శలు రావడం తీవ్ర చర్చకు దారి తీశాయి. కాగా, కొద్ది రోజుల ముందే ట్రంప్.. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. భారత్, రష్యా వాణిజ్యంపై ట్రంప్ ఆగ్రహం సైతం వ్యక్తం చేస్తూ డెడ్ ఎకానమీ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా.. ఉక్రెయిన్‌లో శాంతి చర్చల దిశగా పురోగతి లేకపోతే, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. భారత్, తక్కువ ధరకే లభిస్తున్న రష్యా ముడి చమురుపై ఎక్కువగా ఆధారపడుతోంది. ప్రస్తుతం దేశ చమురు అవసరాల్లో మూడింట ఒక వంతుకు పైగా రష్యా నుంచే దిగుమతి చేసుకుంటోంది. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ, దేశ ఇంధన భద్రత, సార్వభౌమ నిర్ణయాల దృష్ట్యా రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగించాలని కేంద్రం భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. అయితే, ట్రంప్‌కు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య చారిత్రాత్మకంగా బలమైన స్నేహ సంబంధాలు ఉన్నాయని మిల్లర్ అంగీకరించడం గమనార్హం.

# ఉత్తరకాశీ ఉపద్రవం..
# పాండవుల శివాలయం మాయం!



నిజానికి ధరాలి ఎప్పుడూ పేరొందిన పర్యాటక ప్రదేశం కాదు. అయితే అటువైపుగా రాకపోకలు సాగించే యాత్రికులకు మాత్రం బాగానే తెలుసు. గౌముఖ్%-%తపోవన్ లేదా లామా టాప్‌కు వెళ్లే మార్గంలో ట్రెక్కర్లు దాని గుండానే వెళతారు. అయితే ఇప్పుడు ధరాలి అనే పేరు దేశమంతా మారుమోగడానికి ఓ దురదృష్టకర ఉపద్రవం కారణమైంది. అప్పుడెప్పుడో 19వ శతాబ్దం మధ్యలో, ఉత్తరకాశీకి సమీపంలోని హర్సిల్‌లో స్థిరపడిన బ్రిటిషర్ ఫ్రెడరిక్ "పహాడి" విల్సన్, ఆపిల్ తోటలు ఎర్ర రాజ్మా వ్యాపారాన్ని ఈ ప్రాంతానికి పరిచయం చేశాడు. అది స్థానిక ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చింది. అలా నేడు, ధరాలి ఆపిల్ పండ్లు ఉత్తర భారతదేశం అంతటా సరఫరా అవుతున్నాయి. కానీ గత వారం, ఈ తోటలను పోషించిన టెర్రస్‌లు విరిగిపోయాయి. వాటి రవాణాకు వాడిన ఫుట్‌బ్రిడ్జిలు మాయమయ్యాయి. అనేక అందమైన ఇళ్లు అర్థభాగాలే మిగిలాయి. కుటుంబాలు తమ భూమి అడవిలో కలిసిపోవడాన్ని కన్నీళ్లతో చూశాయి. హర్సిల్ నుంచి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తరాఖండ్ కొండలలోని ప్రశాంతమైన పర్వత గ్రామాన్ని ఖీర్ గడ్ నది అకస్మాత్తుగా ఉప్పొంగి ముంచేసింది. ఇళ్ళు, తోటలు సహా మరెన్నో జ్ఞాపకాలను తుడిచేసింది. అందులో కల్ప కేదార్ ఆలయం కూడా ఉంది. దీనిని పాండవులు నిర్మించారని స్థల పురాణం చెబుతోంది. కాలభైరవుని ముఖంతో చెక్కబడిన ఈ నిర్మాణం, 1900ల ప్రారంభంలో ఈ మందిరాన్ని హిమనీ నదుల మార్పు పూడ్చిపెట్టింది. అయినప్పటికీ కల్ప కేదార్ ఆలయ గోపురం స్పష్టంగా కనిపించేది తాజా వరదతో ఆ గోపురం కూడా అదృశ్యమైంది. ఇది ఆ ప్రాంత వాసుల్ని కలచివేసింది. ధరాలి మాజీ గ్రామ ప్రధాన్ మనోజ్ రాణా మాట్లాడుతూ 'ఇది కేవలం వరద కాదు. ఇది మా గ్రామ హృదయాన్ని చీల్చేసింది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు, కల్ప కేదార్ కేవలం ఒక శిల కాదు. ఇది దైవిక రహస్యాన్ని కలిగి ఉంది. ఈ ఆలయం వెలికితీత కోసం 1980లలో అనేక ప్రయత్నాలు చేసినా భూమి నీటి పొరల క్రింద తరతరాలుగా దాగి ఉన్న శివలింగం పూర్తిగా వెలుగు చూడలేదు. పురాణాల ప్రకారం, శివుడు పాండవుల పాపాలను వదిలించుకోవడానికి నిరాకరించి హిమాలయాలలో చెల్లాచెదురుగా విస్తరించాడు. అందుకే కేదార్‌నాథ్ లాగానే కల్ప కేదార్ కూడా ఆ శకలాలలో ఒకటిగా భావిస్తారు. ధరాలి అధికారికంగా పంచ కేదార్ తీర్థ మార్గంలో లేకపోయినా, గ్రామస్తులు కల్ప కేదార్‌ను వాటితో ఆధ్యాత్మికంగా ముడిపడి ఉందని విశ్వసిస్తారు. 'కల్ప కేదార్ ఈ ప్రాంతానికి అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. దీనిని ఆది శంకరాచార్య పునరుద్ధరించారు. శివుని పురాతన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా పూజించారు' అని చార్ ధామ్ తీర్థ పురోహిత్ మహాపంచాయతీ ప్రధాన కార్యదర్శి బ్రిజేష్ సతి వివరిస్తారు. కనపడినంత మేరకు మాత్రమే భక్తి శ్రద్ధలతో తాము కొలుస్తున్న దైవం.. ఇప్పుడు లేశ మాత్రం కూడా కనపడకుండా మాయం అవడం ధరాలి గ్రామవాసుల ఆవేదనను అంతులేకుండా చేస్తోంది. అయితే గతంలోనూ ఇలాంటి ప్రకృతి ఉత్పాతాలు ఆలయాన్ని ముంచేసినా, మళ్లీ తిరిగి కల్పకేదార్ ఎప్పటిలా వెలుగులోకి వచ్చి పూజలు అందుకుందని ఈసారి కూడా అదే జరుగుతుందని నమ్ముతున్న గ్రామస్తులూ పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.


## రాహుల్ గాంధీకి
## కర్నాటక ఎన్నికల అధికారి నోటీసులు..!




లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కర్నాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఓట్ల దొంగతనంపై ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించి డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాలని కోరారు. మహదేవపుర నియోజకవర్గంలోనే నకిలీ ఎంట్రీలు, ఫేక్ అడ్రస్‌లు, ఒకే చోట రిజిస్ట్రేషన్ ద్వారా 1,00,250 ఓట్లు దొంగిలించారని రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈసీఐ డేటా ఆధారంగా 70 సంవత్సరాల ఓటరు శకున్ రాణి రెండుసార్లు ఓటు వేశారన్న రాహుల్ ఆరోపణలపై నోటీసుల్లో పేర్కొంది. సీఈవో కార్యాలయం ప్రాథమిక విచారణలో ఆమె ఒకేసారి మాత్రమే ఓటు వేసిందని పేర్కొంది. శకున్ రాణి లేదంటే.. మరెవరైనా సరే రెండుసార్లు ఓటు వేశారని మీరు నిర్ధారించిన సంబంధిత పత్రాలను అందించాలని.. తద్వారా వివరణాత్మకంగా విచారణ చేపట్టవచ్చని సీఈవో అన్బుకుమార్ నోటీసుల్లో పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ప్రజంటేషన్‌లో చూపించిన టిక్ మార్క్ చేసిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసిన పత్రం కూడా కాదని వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికలను ఈసీ కొరియోగ్రఫీ చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలోనే మహదేవపుర నియోజకవర్గంలో ఫేక్ ఓటర్ల నమోదు, ఫేక్ చిరునామాలు, ఒకే చోట బల్క్ రిజిస్ట్రేషన్ ద్వారా లక్షకుపైగా ఓట్లను దొంగిలించినట్లుగా రాహుల్ ఆరోపించారు. ఇది ఎన్నికల కమిషన్ డేటా అని.. ఈ సమాచారాన్ని ఎవరూ తిరస్కరించలేరన్నారు. అయితే, ఈసీని మరోసారి టార్గెట్ చేస్తూ వెబ్‌సైట్‌ను లాంచ్ చేశారు. ఇందులో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


## ట్రంప్‌కు ప్రధాని మోదీ కౌంటర్!



**బెంగళూరు:** భారత్ 'డెడ్ ఎకానమీ' అంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రధాని నరేంద్ర మోదీ స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. ప్రపంచంలో భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఎంతో సమయం పట్టదంటూ స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరులో మెట్రో ఫేజ్-3 కి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన మోదీ ప్రసంగించారు. భారత్ మూడో ఆర్థిక శక్తి కాబోతుందంటూ ఆయన స్పష్టం చేశారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనేవి భారత్ ఆర్థికంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. 'గత 11 ఏళ్లలో భారత ఆర్థికంగా బలోపేతమైంది. 10వ స్థానం నుంచి 5 స్థానానికి వచ్చాం. ఇప్పుడు మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే ట్రాక్‌లో ఉన్నాం. కచ్చితమైన, నిజాయితీ పరమైన దృష్టి పెట్టడంతోనే ఇది సాధ్యమవుతూ వస్తుంది. అందుకే ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనం దగ్గర్లోనే ఉన్నాం,' అని తెలిపారు. 2014 నాటికి మన దేశంలో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైలు అందుబాటులో ఉండేది. ఇప్పుడు 24 నగరాల్లో ఆ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇది ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్. 2014 నాటికి ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లు అనేవి ఏడు, మెడికల్ కాలేజీలు 387 ఉండేవి. ఇప్పుడు మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లు 22, మెడికల్ కాలేజీలు 704 ఉన్నాయి. ఎలక్ట్రికల్ రైళ్లు 2014 నాటికి 20వేలు మాత్రమే ఉంటే నేటికి అవి 40వేలు అయ్యాయి. ఇక ఎయిర్‌పోర్ట్‌లు 74 నుంచి 180కు పెరిగాయి' అని ప్రభుత్వం సాధించిన ఘనతలను చెప్పుకొచ్చారు మోదీ.

## వాళ్లు ప్రతి ఒక్కరికీ తామే బాస్‌లు
## అనుకుంటున్నారు..
## అమెరికాపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ ఫైర్

అమెరికా తనపట్ల వ్యవహరిస్తున్న తీరుపై భారత్ మరోసారి మండిపడింది. అమెరికా



అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో రాజ్‌నాథ్ తాజా వ్యాఖ్యలు చేశారు. కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ ఆ పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కొందరు 'బాస్'లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. 'మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోంది అని వాళ్లు అసూయ పడుతున్నారు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయని రాజ్‌నాథ్ ఆరోపించారు. తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుందని ఆ దేశాలు భావిస్తున్నాయని అన్నారు. అయితే భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదని చెప్పారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక
RNI No: APTEL/2020/1906



# టాప్‌3 దిశగా భారత్

-మొదటిపేజీ తరువాయి

మీటర్లకు పైగా మెట్రో నెట్‌వర్క్ విస్తరించిందని చెప్పారు. “2014కు ముందు దేశంలో దాదాపు 20,000 కి.మీ. రైలు మార్గాన్ని విద్యుద్దీకరించారు. గత 11 సంవత్సరాల్లో ఎన్డీయే ప్రభుత్వంలో 40,000 కి.మీ.కు పైగా రైలు మార్గాన్ని విద్యుద్దీకరించాం. 2014 నాటికి దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 160కు పైగా పెరిగింది. జలమార్గాలను కూడా ఇదే రీతిలో అభివృద్ధి చేశాం. 2014 నాటికి కేవలం 3 జాతీయ జలమార్గాలు పనిచేస్తుండగా, ఇప్పుడు ఈ సంఖ్య 30కి పెరిగింది” అని మోదీ వివరించారు.

**3 వందే భారత్ రైళ్లు ప్రారంభం**

ఒకరోజు బెంగళూరు పర్యటనలో భాగంగా మూడు వందే భారత్ రైళ్లతో పాటు ఎల్లోలైన్ మెట్రో సేవలను మోదీ జాతికి అంకితం చేశారు. బెంగళూరు నుంచి బెళగావి నగరానికి వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఇదే వేదికగా అమృత్‌సర్ నుంచి మాతా వైష్ణోదేవికత్రాకు, నాగ్‌పూర్ నుంచి పుణెకు వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. బెంగళూరు నగరానికి తలమానికంగా ప్రధానంగా ఐటీ కంపెనీలు, పారిశ్రామికవాడలకు అనుబంధమైన ఆర్‌వీ రోడ్డు–బొమ్మసంద్ర మధ్య ఎల్లోలైన్ మెట్రో సేవలను ప్రధాని ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ సిటీలో మెట్రో ఫేజ్–3 జేపీనగర్ 4వ స్టేజ్ నుంచి కనకపుర అవుటర్ రింగ్ రోడ్డు దాకా, మాగడి రోడ్డు హొసహళ్లి నుంచి కడబగెరె దాకా 44.65 కిలోమీటర్ల మెట్రో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

**మెట్రోకు 87% రాష్ట్ర నిధులే: సిద్దరామయ్య**



మెట్రో ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం 87.37% ఖర్చు చేస్తుండగా కేంద్రం వాటా 12.63% మాత్రమేనని కర్ణాటక సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఎలక్ట్రానిక్ సిటీలో జరిగిన సమావేశంలో ప్రధాని సమక్షంలోనే ముఖ్యమంత్రి మెట్రో ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా పెరుగుతోందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చు చేయాల్సి ఉందని, 12 శాతం మాత్రమే కేంద్రం భరిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. 2014కు ముందు కర్ణాటకకు రైల్వే బడ్జెట్‌లో రూ.835 కోట్లు మాత్రమే కేటాయించారని, మోదీ ప్రధాని అయ్యాక ప్రస్తుతం 7500 కోట్లకు పెంచారని తెలిపారు. మరోవైపు, వేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు ప్రగతికి ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని మోదీని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరారు. బెంగళూరులో నీటి సరఫరా, చెత్త సేకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.1.5 లక్షల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో అత్యధికంగా పన్నులు చెల్లించే రాష్ట్రాల్లో కర్ణాటక రెండో స్థానంలో ఉందని, కేంద్ర ఖజానాకు సుమారు 4.5 లక్షల కోట్లు సమకూరుస్తోందని వివరించారు.

**ఎల్లరిగూ నమస్కార: మోదీ**

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా బెంగళూరుకు వచ్చానని మోదీ అన్నారు. కన్నడిగులను ఆకట్టుకునేలా కన్నడ భాషలో ‘ఎల్లరిగూ నమస్కార’ (అందరికీ నమస్కారం) అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌లో బెంగళూరు, ఇక్కడి యువత కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశంలో ఐటీ, రక్షణ రంగాల్లో స్వావలంబన సాధించడంలో బెంగళూరు పాత్ర కీలకమని కొనియాడారు. ప్రపంచ ఐటీ రంగంలో బెంగళూరుది ప్రత్యేక స్థానమని అన్నారు. ప్రస్తుతం బెంగళూరు దేశంలో అతి పెద్ద మెట్రో సంచారం గల రెండో నగరమని అన్నారు. ప్రధాని మోదీ నగరంలోని జయనగర్ రాగిగుడ్డ స్టేషన్ నుంచి ఎలక్ట్రానిక్ సిటీ దాకా మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కార్మికులు, మెట్రో అధికారులతో ముచ్చటించారు.

# వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది : జగన్

**పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు**
**సీఎం చంద్రబాబుపై జగన్ తీవ్ర ఆరోపణలు**
**అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్ చేస్తున్నారని విమర్శ**
**వైసీపీ నేతలపై టీడీపీ గ్యాంగులు దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయని ధ్వజం**
**బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన**

**పులివెందుల**



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకంగా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. “ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపైకూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు” అని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరపున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. “ఆగస్టు 8నమా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు” అని ఆయన విమర్శించారు. పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. “నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది” అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..

## నాన్‌స్టాప్ సహా ఈ బస్సుల్లో డబ్బులు పెట్టి టికెట్ తీసుకోవాల్సిందే!

ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పంద్రాగస్టు సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ పథకం అమలు కోసం 8,458 బస్సులను సిద్ధం చేసింది. అలాగే రద్దీకి తగినట్లుగా ఏర్పాటు కూడా చేస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఏయే బస్సుల్లో అమలు చేయాలి? గుర్తింపు కార్డుగా వేటిని అనుమతించాలనే దానిపై ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ఉచిత ప్రయాణం పథకానికి సంబంధించి సమగ్ర వివరాలతో రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ క్రమంలో ఉచిత బస్సు ప్రయాణం ఏయే బస్సుల్లో ఉండదో ఒక ప్రచారం జరుగుతోంది.

**ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు.**

%–% ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనుమతిస్తారు. అయితే కొన్ని ఇంటర్ స్టేట్ సర్వీసుల్లో నడిచే ఎక్స్‌ప్రెస్‌ల్లో మాత్రం దీన్ని అనుమతించరు. అంటే ఏపీ నుంచి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల్లోని వివిధ ప్రాంతాలకు కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో ఉచిత ప్రయాణం ఉండదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, నంద్యాల జిల్లాలోని శ్రీశైలం ఘాట్లలో తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు ఉండదట. ఘాట్ రోడ్లలో నడిచే బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తే.. రద్దీ పెరిగి ఘాట్ రోడ్డులో బస్సు నడపడం కష్టతరమవుతుందనే ఉద్దేశ్యంతో ఆయా రూట్లలో



ఉచిత ప్రయాణానికి అనుమతించవద్దని భావిస్తున్నారు. తిరుమల ఘాట్ బస్సుల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణం ఉండదు. నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత బస్సు ప్రయాణం ఉండదు.

**తిరుమల ఘాట్ బస్సుల్లోనూ నో ఫ్రీ**

ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలో మొత్తం 11,449 బస్సులు ఉన్నాయి. వీటిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు(5851), ఎక్స్‌ప్రెస్‌లు (1610), సిటీ ఆర్డినరీ (710), సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ (287)లు కలిపి మొత్తం 8,458 బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నారు. అల్ట్రా డీలక్స్ (643), సూపర్ లగ్జరీ (1486), నాన్ ఏసీ స్లీపర్ స్టార్‌లైనర్ (59), ఏసీ బస్సులు (459), తిరుమల ఘాట్ బస్సులు (344) కలిపి మొత్తం 2991 బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అనుమతించరు.

## పాక్‌తో భారత్ మ్యాచ్ ఆడటమేంటి?

## ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ:** ఆసియా కప్‌లో భాగంగా భారత్, పాకిస్తాన్ మధ్య జరగబోయే క్రికెట్ మ్యాచ్‌పై ఎంఐఎం అధినేత, లోక్‌సభ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రక్తం, నీళ్లు కలిసి ప్రవహించలేవు.. పాకిస్తాన్‌తో భారత్ క్రికెట్ ఎలా ఆడుతుంది అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మ్యాచ్‌కు బీసీసీఐ ఎలా అనుమతి ఇచ్చింది అంటూ నిలదీశారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జాతీయ మీడియా పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ..‘నీళ్ళు, రక్తం కలిసి ప్రవహించలేవని.. చర్చలు, ఉగ్రవాదం కలిసి సాగలేవని ప్రధానమంత్రి మోదీ స్వయంగా చాలా సార్లు చెప్పారు. ఇలా మాట్లాడి.. మళ్లీ ఇప్పుడు పాకిస్తాన్‌తో ఎలా క్రికెట్ ఆడుతారు. దుబాయ్‌లో పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నామని తెలిసి నేను ఆశ్చర్యపోయాను. నేను ఈ మ్యాచ్‌ను చూడను. పాక్‌తో భారత్.. వాణిజ్య సంబంధాలను తెంచుకున్నారు, గగనతలాన్ని మూసివేశారు. కానీ, మీరు క్రికెట్ ఆడటానికి సిద్ధంగా ఉన్నారా? ప్రశ్నించారు. పాక్‌తో ఆడటానికి కేంద్రం ఎలా అనుమతి ఇస్తుంది. భారతదేశంలో క్రికెట్ అనేది ఒక వ్యామోహం. క్రికెట్ ప్రతీ దాన్ని స్తంభింపజేస్తుంది అని అన్నారు. ఇదే సమయంలో పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రజలు వారి కుటుంబ సభ్యుల ముందే చనిపోయారు. ఈ దాడి నన్ను తీవ్రంగా బాధించింది. ఈ ఘటన చాలా దారుణం. భార్యాపిల్లల ముందే తమ వారిని ఎవరైనా హత్య చేయడం బాధాకరం. ఇంత దారుణం జరిగినప్పుడు పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటంలో అర్థం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీసీఐ, కేంద్ర ప్రభుత్వం మ్యాచ్‌కు అనుమతి ఇస్తుంది?. పాక్, భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, హిందూ ఉగ్రవాదం అనేదే లేదు అని హెూంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనకు ప్రతిస్పందిస్తూ.. మహాత్మా గాంధీని ఎవరు చంపారు? ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలను ఎవరు చంపారు?. మహాత్మా గాంధీని ఎవరు చంపారో అమిత్ షా మర్చిపోయి ఉండవచ్చు అంటూ వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో భద్రతా లోపానికి జవాబుదారీతనం వహించాలి. భారీ సైనిక ఉనికి ఉన్నప్పటికీ ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారు?. పౌరులను ఎలా హత్య చేయగలిగారు?. ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటికీ ఉగ్రవాద నిరోధక చర్యలు విఫలమయ్యాయి’ అని విమర్శించారు.

## ఈ చిన్నారులు కనిపించలేదా?



**బేస్తవారపేట :** ఆ కుటుంబంలో ముగ్గురు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు. ఉండడానికి ఇల్లు లేదు. తిండి లేదు. దిక్కుతోచని స్థితిలో ఇంటింటికీ తిరుగుతూ ఎవరైనా అన్నం పెడితే తిని జీవిస్తున్నారు. అధికారులకు ఈ చిన్నారులు కనిపించలేదు. పీ–4 సర్వేలో వీరిని గుర్తించకపోవడం గమనార్హం. మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన అరవీటి శ్రీనివాసులు, ఉమ అనే దంపతులు మూడేళ్ల క్రితం నెల రోజుల వ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో భావన (13 ఏళ్లు) పెద్ద అమ్మాయి. తల్లిదండ్రులు చనిపోయాక భావన చెల్లి కీర్తన, తమ్ముడు యశ్వంత్‌కు పెద్ద దిక్కు యింది. వారిని చదివించాలని భావించి ఒక పక్క తానూ చదువుతూనే సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్తోంది. వచ్చిన డబ్బులతో చాలీచాలని జీవనం సాగిస్తున్నారు. కంభం మండలం నల్లగాల్వ గ్రామ పాఠశాలలో భావన, యశ్వంత్ 8వ తరగతి చదువుతున్నారు. కీర్తన 7వ తరగతి అభ్యసిస్తోంది. ముగ్గురూ నిత్యం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి వీరే భోజనం వండుకొని తింటు న్నారు. నా అనేవారు లేక, వసతులు లేక, ఆర్థిక ఇబ్బం దులతో చిన్నారులు సతమతమవుతున్నారు. దీనస్థితిలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే స్థానిక అధికారులు పీ–4 సర్వేలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నది ఆ ముగ్గురు చిన్నారులను చూస్తే అర్థమవుతోంది. మండలంలో రెండో విడత పీ–4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల్లో వారు ముగ్గురు ఉన్నారని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు చెప్పారు.

## పులివెందులలో పోరు ఏకపక్షమేనా ?

-మొదటిపేజీ తరువాయి

జగన్ చేతిలో పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి భార్య లతారెడ్డిని రంగంలోకి దించింది. తద్వారా ఈ పోరును తాము ఎంత సీరియస్ గా తీసుకుంటున్నామో చెప్పకనే చెప్పింది. దీంతో వార్ హెూరాహెూరీగా మారింది.

అయితే స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, సమీకరణాల్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి జడ్పీటీసీగా ఎన్నికవడం లాంఛనమే అన్న చర్చ జరుగుతోంది. దీంతో టీడీపీ చివరి నిమిషంలో కూటమి పార్టీలకు చెందిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, టీడీపీ మంత్రులు కొలుసు పార్థసారధి, సవితతో పాటు స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవితో పాటు పలువురు సీనియర్ నేతల్ని రంగంలోకి దింపి ప్రచారం చేయిస్తోంది. ఓ జడ్పీటీసీ ఉపఎన్నిక కోసం ఇంత మంది రంగంలోకి దిగడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. దీన్ని బట్టి చూస్తే ఈ ఎన్నిక ఫలితం అర్థమవుతోందని స్థానికంగా చెప్పుకుంటున్నారు.

# రెండు బైక్‌లు ఢీ ఇద్దరి దుర్మరణం

**చిట్టమూరు**

చిట్టమూరు మండలం మొలకల పూడి రోడ్డు మలుపు సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలోఇద్దరు మృతి చెందారు. ఓ మహిళ, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాల య్యాయి. పోలీసుల కథనం మేరకు... పెళ్లకూరు మండలం పెన్నెపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణయ్య, ఆయన భార్య నవీనమ్మ, కుమారుడు కిషోర్, స్వర్ణ ఆదివారం నాయుడుపేట మండల పరిధిలోని గొట్టిప్రోలులో చర్చికి వెళ్లారు. ప్రార్థనల అనంతరం తిరిగి ఇంటికి



వస్తుండగా వాకాడు చర్చి కాంపౌండ్‌కు చెందిన కావలి కిరణ్ నాయుడుపేట నుంచి వాకాడుకు బైక్‌లో వెళ్తూ చిట్టమూరు మండలంలోని మొలకలపూడి మలుపు సమీపంలో వెంకటరమణయ్య కుటుంబ సభ్యుల ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటరమణ య్య(40), కావలి కిరణ్ (36) తలలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. నవీనమ్మ, కిషోర్, స్వర్ణలకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. తీవ్రంగా గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల ద్వారా సమా చారం అందుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరు కొని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వెంకటరమణయ్య, కిరణ్ మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

# పౌల్ట్రీ నిర్మాణంలో దాగుడుమూతలు

### టీడీపీ నేతల ఆరాటం- పోరాటం వెనుక ఆంతర్యం ఏమిటి

### ఎవరికి ఎంత ముట్టింది- డిమాండ్ రేంజ్ ఎంత?





పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు10.

మండలంలోని చిల్లకూరు గ్రామంలో ఉన్న మన్నేమ-ుత్తూరు చెరువు భూములను ఆక్రమించి ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న పౌల్ట్రీ నిర్మాణ పనుల మాటున అధికార పార్టీ నేతల దాగుడుమూతలు ఏమిటి?. ఒకప్పుడు దగ్గరుండి భూములు కొనుగోలు చేయించి, వేల టన్నుల చెరువు మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టి భూ లెవలింగ్ పనులు చేయించినప్పుడు పౌల్ట్రీ యాజమాన్యం నుండి ఎంత డిమాండ్ చేశారు? ఏ స్థాయిలో జేబులు నింపుకున్నారు? ఇప్పుడు ఏకంగా తిరుగుబాటు ఎందుకు చేస్తున్నారు? గ్రామస్తుల కళ్ళు కప్పి పౌల్ట్రీ నిర్మాణం వెనుక అధికార పార్టీ పెద్దలు చేస్తున్న చదరంగం ఏమిటి?. గ్రామంలోని సర్వే నంబర్ 34 -2 లో 0.70 ఎకరాలు, సర్వే నంబర్ 43-4లో 1 ఎకరం మొత్తం1.70 ఎకరాలు చెరువు భూములు ఉన్నాయి. తిరుపతికి చెందిన ఓపారిశ్రామికవేత్త చిల్లకూరు గ్రామం మన్నేముత్తూరు చెరువు సమీపంలో కొంతమేర పట్టా భూములను కొనుగోలు చేసి దానికి సమీపంలో ఉన్న సుమారు 4.70 ఎకరాలు చెరువు పోరంబోకు భూములను ఆక్రమించి పౌల్ట్రీ నిర్మాణం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే పౌల్ట్రీ నిర్మాణం కోసం భూములు కొనుగోలు ప్రారంభం నుంచి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కొందరు అండదండలు మెండుగా కురిపించి అందుకున్నంత వరకు దోచుకుని యాజమాన్యానికి అండగా నిలిచినట్లు తెలుస్తుంది. అయితే ఆశించిన స్థాయిలో పూర్తిగా అందకపోవడంతో పౌల్ట్రీ యాజమాన్యంపై తిరుగుబాటు ధోరణితో గ్రామ ప్రయోజనాల నిమిత్తం అంటూ ఎదురుదాడికి దిగినట్లు తెలుస్తుంది. గ్రామంలో రామ మందిర నిర్మాణం కోసం ఒకరు పది లక్షలు డిమాండ్ చేస్తుంటే, హరిజనవాడలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కోసం మరో 10 లక్షలు అంటూ ఇంకొకరు డిమాండ్ చేస్తున్నారు? అభివృద్ధి మాటను అధికార పార్టీ నేతలు చేస్తున్న దాదాగిరి పోలీస్ స్టేషన్ వరకు చేరుకుంది. 15 ఏళ్లు కిందట మాజీ సర్పంచ్ బసవిరెడ్డి వెంకట శేషారెడ్డి రైతుల ప్రయోజనాల నిమిత్తం చెరువులో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం పౌల్ట్రీ నిర్మాణ పనులు చేస్తుండడం వల్ల తాత్కాలిక రోడ్డును మరింత అభివృద్ధి చేసి అటు రైతులు ఇటు పౌల్ట్రీ యాజమాన్యం వినియోగించుకుంటున్నారు. అయితే నీటిపారుదల శాఖ నిబంధనలకు విరుద్ధంగా చెరువులో అక్రమంగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయడం అన్యాయమంటూ అధికార పార్టీ నేతలు గగ్గోలు పెట్టడం వెనుక దాగి ఉన్న ఆంతర్యం ఏమిటి?. చిల్లకూరు, వడ్డీ పాలెం గ్రామాలకు అత్యంత సమీపంలో పౌల్ట్రీ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో గాలి, నీటి కాలుష్యం ఏర్పడి మూగజీవాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ముప్పు పొంచి ఉన్నప్పటికీ తొలినాళ్లలో పౌల్ట్రీ యాజమాన్యంకు అధికార పార్టీ నేతలు అండగా ఎందుకు నిలిచారు అన్నది గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో పరిశీలించి చిల్లకూరు వడ్డీ పాలెం గ్రామాల ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

## "గిరిజన నేత" జిల్లా ప్రధాన కార్యదర్శి 'సురేంద్రకు' సన్మానం



నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 10

ప్రపంచ ఆదివాసులదినోత్సవ శుభ సందర్భంగా నెల్లూరులో గిరిజనుల భవన్లో నెల్లూరు ఐటీడీఏ పీవో మల్లికార్జున్ రెడ్డి మరియు నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి మరియు డిటిడబ్ల్యు ఆఫీసర్ పరిమళ ఆంధ్రప్రదేశ్ స్టేట్ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య లు సంయుక్తంగా కలసి గిరిజనుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఎల్లవేళలా సేవ చేస్తున్నటువంటి ఆంధ్ర ప్రదేశ్ గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండేటి సురేంద్రను ఆదివాసుల దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర సేవలను కొనియాడారు

## "పూజితమ్మకు" తోటపల్లి గూడూరు వైయస్సార్ సిపి నేతల అభినందనలు



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 10

వైయస్సార్సీపి రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా మాజీ మంత్రి కాకాణిగోవర్ధన రెడ్డి కుమార్తె పూజితమ్మను నియమించడం పట్ల తోటపల్లి గూడూరు మండల వైయస్సార్సిపి నేతలు ఆమెనుపూల బొకేతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో రాష్ట్రకార్యనిర్వాహక బాధ్యతలు స్వీకరించడాన్ని వారు కొనియాడారు.ఈ బాధ్యతలోపూజితమ్మ మరింత రాణించాలనిదైవాన్ని వేడుకున్నారు.మండల అధ్యక్షులుఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలోవైకాపా సీనియర్ నాయకులుచిల్లకూరు సుధీర్ రెడ్డిఇసనాకరమేష్ రెడ్డి తలమంచిసురేంద్రబాబుచెరుకూరు శ్రీనివాసులు నాయుడుకిషోర్ గౌడ్దకిషోర్ గౌడ్ తదితరులున్నారు

## వెంకటగిరిలో డ్రోన్ కెమెరాతో పోలీసుల తనిఖీలు



స్వర్ణ సాగరం - వెంకటగిరి



బహిరంగప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్ కెమెరాలతో మెగా పెంచుతామని వెంకటగిరి సీఐ ఏవి రమణ వెల్లడించారు. అ అసాంఘిక కార్యక్రమాలను డ్రోన్ కెమెరాలతో అడ్డుకుంటామన్నారు. వెంకటగిరి సమీపంలో ని టి డ్కో ఇళ్ల వద్ద డ్రోన్ కెమెరా ఎగరవేసి పరిసర ప్రాంతాలను చెక్ చేశారు. చుట్టాలను అతిక్రమిస్తే వారిపై కఠినమైన చర్యలు తప్పవని వెంకటగిరి సిఐ ఏవి రమణ తెలియజేశాడు.

## పంట పొలాల్లో మోటార్లు చోరీ..ఆందోళనలో రైతులు..





విడవలూరు స్వర్ణ సాగరం ఆగస్టు 10 :

డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజకవర్గంలో చాలామంది రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పై ఆధారపడి పంటను సాగు చేస్తున్నారు. అయితే ఇందుకు తమ పొలాలకు వేల రూపాయలు వెచ్చించి మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేస్తున్న సమయంలో పొలాల్లోమోటార్లు చోరీ రైతులను ఆందోళనకు గురిచేస్తుంది.విడవలూరు మండలం దంపూరు పంచాయతీలో వరుస మోటార్ల దొంగతనం రైతులను కుదిపేస్తుంది.దంపూరు పరిధిలో రెండు మోటార్లు చోరీకి గురయ్యాయి. గతంలో పలుమార్లు ఇలా మోటార్లు దొంగతనానికి గురవటం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సర్పంచ్ సురేందర్ రెడ్డి రైతులు స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని వారు ఎంక్వయిరీ చేస్తామన్నారే తప్ప ఎలాంటి విచారణకు రాలేదని రైతులు వాపోతున్నారు . ఎస్సై సరిగా స్పందించి మోటార్లు దొంగతనాలను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. పంట చేతికి వచ్చే టైం లో మోటర్లు దొంగతనానికి గురవడంతో పొలాలు ఎండిపోతున్నాయని వారిని ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సులూరుపేట ఎమ్మెల్యే.

### డాక్టర్ నెలవల విజయశ్రీ,పార్థసారథి దంపతులు.



స్వర్ణసాగరం (నాయుడుపేట) ఆగస్టు 10

నూతన వధూవరులైన మానస, మధు రెడ్డి లను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెల విజయశ్రీ పార్థసారథి దంపతులు ఆశీర్వదించారు.నాయుడుపేట పట్టణం అశోక్ నగర్ లో నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,దేవసేన ల కుమార్తె మానస,మధు రెడ్డిల వివాహ మహోత్స16 రోజుల పండుగ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు నూతన వధూవరులైన మానస,మధురెడ్డి లను ఆశీర్వదించారు.

## ఘనంగా ఓం శక్తి అమ్మవారి పూజలు





పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 10

చిన్న కలికిరి గ్రామంలో ప్రతి సంవత్సరం ఆడి నెలలో ఓం శక్తి అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఓం శక్తి అమ్మవారి భక్తులు చుట్టుపక్క గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి ముక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలు

చిన్న కలికిరి, బోడిరెడ్డి కండ్రిగ గ్రామస్తులు ఆధీనంలో నిర్వహించబడతాయి. ఓం శక్తి భక్తులు మాట్లాడుతూ ఈరోజు ఉదయం అమ్మవారిని చిన్న కలికిరి బోడి రెడ్డి కండ్రిగ లలో ఊరేగింపుగా తీసుకొని వెల్లి సాయంత్రం 6 గంటలకు అమ్మవారిని ఆలయానికి చేరుస్తారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు ఆర్కెస్ట్రా నిర్వహించి రేపు ఉదయం పూజ కార్యక్రమాలు పూర్తి అవుతాయని తెలిపారు భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు అదేవిధంగా అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## హరికథ భాగవతారిణి సత్కరించిన తుంబకుప్పం జమీందార్ బి.కే.గిరిబాబు

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 10



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు-పాళ్యం మండల పరిధిలోని తుంబకుప్పం గ్రామంలో జరుగుతున్న మహాభారతం యజ్ఞంలో భాగంగా సాంప్రదాయంగా హరికథ బృందం భగవతారిణి డాక్టర్ శ్రీమతి ఎస్.శివకుమారి వారి బృందాన్ని తుంబకుప్పం ఎస్టేట్ మాజీ జమిందార్ కీర్తిశేషులు బి.కే.నరసింహులు నాయనివారు మనవడు బంగారుపాళ్యం మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు బి.కే.గిరిబాబు శ్రీమతి బి.కె.త్రివేణి ముని మనవడు బి.కే. ప్రశాంత్ ముని మనవరాలు బి.కె.జ్ఞాన సుప్రియ జమిందార్ గృహము నందు మంచి విందు భోజనం ఏర్పాటు చేసి భగవతారని గారిని చీర సారెతో ఆదివారం సత్కరించడం జరిగింది. బాగవతాని శివకుమారి వీరికి వీరి కుటుంబానికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ఆ ద్రౌపది మాతను కోరినట్లు తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాభారతాన్ని విని తరించాలని,మీ జమిందర్ కుటుంబాలకు ద్రౌపతి దయతో అష్టఐశ్వర్యాలు కలగాలని కోరుకుంటున్నట్లు భాగవతారిణి శివకుమారి తెలిపారు

స్వర్ణసాగరం



# గౌడ సంఘం యువజన మండలాధ్యక్షుడుగా కడెం ప్రశాంత్

గౌడ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- రాష్ట్ర నాయకులు కమలాకర్ గౌడ్



స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగస్టు10:

గౌడ సంఘం యువజన మండలాధ్యక్షుడిగా కాడెం ప్రశాంత్ ను ఏకగ్రీవంగా నియమించినట్లు రాష్ట్ర నాయకులు గునుగంటి కమలాకర్,పెద్ది వెంకన్న గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని చిలుకోడు గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ కులస్తులు అన్నిరంగల్లో ముందుకు సాగాలని,గౌడ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వారు తెలిపారు.ఈనెల 16న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహవిష్కరణ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శి ఉపేందర్,సలహాదారులు బంధం రవి, ఉపాధ్యక్షులు సాయి,భాస్కర్, కోశాధికారి కాడెం ఉపేందర్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండి దీపక్,సాయి, కార్తీక్,కృష్ణ,చిరంజీవి,వెంకన్న,వీరేందర్,విక్రమ్,అనిల్, వీరన్న,రాకేష్, మహేష్,వివేక్,వీరభద్రం,సైదులు తదితరులున్నారు.

# పినాకి సత్యాగ్రహ గాంధీ ఆశ్రమలో సర్వమత ప్రార్థనలు





ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 10

మండలంలోని పల్లిపాడు పినాకిని గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్ధనలు నిర్వహించారుఈ కార్యక్రమంలో ముందుగా కార్యక్రమంలముందుగా బయన్న చిరంజీవి మహాత్మా గాంధీ విగ్రహానికిఖాదీ వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు, ఆశ్రమ స్థల దాత పోనక.కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మా గాంధీ యొక్క జీవిత విశేషాల గురించి వివరించడం. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్ స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ రహదారిపై బైక్ - కారు ఢీ: ఒక్క వ్యక్తి మృతి,

స్వర్ణ సాగరం- తొట్టంబేడు,



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం సమీపంలోని మల్లీగుంట రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం దుర్ఘటన చోటుచేసుకుంది. లింగమనాయుడు పల్లికి చెందిన కోగిల జయరాం (35) తన బైక్‌పై వెళ్తుండగా, వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

స్థానికుల సమాచారం ప్రకారం, కొత్త రహదారి ఏర్పడ్డ తర్వాత శ్రీకాళహస్తి%-% నెలబల్లి జంక్షన్ వరకు దాదాపు ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు అనేక మంది ప్రాణాలు కోల్పోగా, మరెందరో తీవ్రంగా గాయపడ్డారు.

ఈ ఘటనలు తరచూ జరగడానికి ప్రధాన కారణం ు అధికారుల పర్యవేక్షణ లోపం అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలను నివారించడానికి తక్షణమే ఈ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

(1) రహదారిపై స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం,

(2) వాహనదారులకు వేగపరిమితి అమలు చేయడం,

(3) అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం,

(4) గ్రామస్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడం,

(5) గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయడం,

(6) నిత్యం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించడం,

గ్రామస్థులు, స్థానిక నాయకులు, సంబంధిత శాఖ అధికారులు కలిసి ముందడుగు వేస్తే, ఈ ప్రమాదాలను కొంతవరకు తగ్గించవచ్చని ప్రజాభిప్రాయం.

# నారా లోకేష్ బాబు స్ఫూర్తితో రైతులకు అన్నదాన కార్యక్రమం

కార్యనిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు





ఐరాల,ఆగస్టు 10 స్వర్ణ సాగరం

నారా లోకేష్ బాబు స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం రైతులు, ప్రజల కోసం. ఆదివారం ఐరాల మండలం పొలకల సంత గేటు లో ఐరాల మండలం తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో, ప్రముఖ పారిశ్రామికవేత్త సన్నపనేని వెంకటేష్ నాయుడు, యువ నాయకుడు భగవాన్ చౌదరి పర్యవేక్షణలో, నిర్విరాయంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 17వ వారం కి చేరుకుంది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు ప్రజలకు భోజనం అందించడమే మోతుకూరి సోమశేఖర్ నాయుడు ఉద్దేశం. ఈ అన్నదాన కార్యక్రమానికి పలువురు రైతులు, ప్రజలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కోవూరి రాజశేఖర్ నాయుడు ,బొబ్బ సోమశేఖర్ నాయుడు, యోగేశ్వర్, నందకిషోర్ చౌదరి, జగదీష్ చౌదరి, కూసి శివకుమార్, చరణ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో ప్రముఖులు



కాణిపాకం, ఆగస్టు 10 స్వర్ణ సాగరం

గణనాధుని సేవలో ప్రముఖులు. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు ,తిరుపతి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి , చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్,వీరు వేరువేరుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం స్వామివారి చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ఎస్.ఐ నరసింహులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.







# ఒంటిమిట్ట అభివృద్ధికి కూటమి గెలుపు అవసరం

ప్రజాస్వామ్యం కోసం అభివృద్ధి కోసం సైకిల్ గెలవాలి : పూతలపట్టు శాసనసభ్యులు డా.కలికిరి మురళీమోహన్



ఐరాల, ఆగస్టు 10 స్వర్ణ సాగరం

కడప జిల్లా, ఒంటిమిట్టజడ్పీటీసీ ఉపఎన్నికల్లో భాగంగా ఒంటిమిట్టలోని రజక కాలనీ, కల్లావారి వీధి, బజారు వీధుల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి కృష్ణారెడ్డి తో పాటుగా మంత్రివర్యులు మహమ్మద్ ఫరూక్ పూతలపట్టు శాసనసభ్యులు డా. కలికిరి మురళీమోహన్ మాజీమంత్రి, ఎమ్మె పత్తిపాటి పుల్లారావు , కడప నగర మైనార్టీ నాయకులు అమీర్ బాబు గారు, శాప్ ఛైర్మన్ రవినాయుడు గార్లు ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అదేవిధంగా అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి జడ్పిటిసి అభ్యర్థి కృష్ణారెడ్డి ని గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు. అనంతరం బజారు వీధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఒంటిమిట్ట భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా అందించగల శక్తి కూటమి ప్రభుత్వానికే ఉంది అన్నారు. వైసీపీ పాలనలో దళితులకు, బీసీలకు అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వంలో ఎస్సీలకు ఇచ్చిన 27 పథకాలను రద్దు చేశారని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతులను నాశనం చేసిన వైసీపి, ఇప్పుడు డబ్బుల సంచులు పంచి గెలవాలని చూస్తోందన్నారు. కానీ ఈసారి ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరని అని అన్నారు. ముద్దు కృష్ణారెడ్డి సౌమ్యుడు, వివాదాలకు దూరంగా ఉండే నాయకుడని పేర్కొంటూ, ఒంటిమిట్ట అభివృద్ధికి ముద్దు కృష్ణారెడ్డి గెలుపు అవసరం అని గుర్తు చేస్తూ సైకిల్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి జెడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించండి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన తెలియ జేసిన టి పి గూడూరు మండల సి.పి.యం నాయకులు.




తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 10

. మండలంలోనిమహాలక్ష్మిపురం లో ఆదివారం వెంకన్నపాలెం ఆక్సిలరీ శాఖ కార్యదర్శి చింతా రామసుబ్బయ్య ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ మీటర్లు ను రద్దు చేయాలని సి.పి.ఎం పార్టీ మండల కమిటీ నిరసన తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా సీ.పీ.యం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ గారు మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ బిల్లులు భారంగా మారాయని అదానికి కోట్లు కూడపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ మీటర్ల ప్రక్రియని అప్పటి ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం నారా లోకేష్ గారు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని పిలుపునిచ్చారు కాని నేడు ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడంలో కూటమి తెలుగు దేశం ప్రభుత్వం ముందు ఉన్నదని గత ప్రభుత్వం చేసింది తప్పు అయితే మీరు చేస్తున్నది తప్పేనని ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగింపు వ్యతిరేకంగా విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మహాలక్ష్మి పురం సెంటర్లో కరపత్రాలను పంపిణీ చేశారు.ఆగస్టు 28 వ తేదీ విద్యుత్ బారాలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ దినం అందరూ పాటిద్దాం అని ప్రభుత్వంపై ఒత్తిడి చేద్దామని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.పి.యం నాయకులు మోచర్ల రాధయ్య, సునీల్,చింతా శ్రవంత్,జెడ్డా లెనిన్, మన్నెం శీనయ్య మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో వేడుకగా 'తిరంగా యాత్ర'








శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఆగస్టు 10, 2025:

భారత సైనిక దళాల ధైర్యసాహసాలను స్మరించుకుంటూ గత రెండు నెలలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'తిరంగా యాత్ర' ఆదివారం శ్రీసిటీలో వేడుకగా సాగింది. ఐఐఐటి-శ్రీసిటీ, క్రియా విశ్వవిద్యాలయం, స్టేషన్-%ూ%, శ్రీసిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మా, ఆస్ట్రోటెక్ స్టీల్స్, వెర్మిరెన్, జెన్ లినెన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, బ్లెండ్‌హబ్ సంస్థలు దీనిని స్పాన్సర్ చేశాయి. ఉదయం 7 గంటలకు ఐఐఐటి-శ్రీసిటీ ఆవరణ నుంచి యాత్ర ప్రారంభమై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదగా కొబెల్కో కూడలి వరకు కొనసాగి మళ్ళీ వెనక్కు ఐఐఐటి-శ్రీసిటీని చేరుకుంది. విద్యార్థులు, అధ్యాపకులు, నివాసితులు త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి స్వేచ్ఛ, ఐక్యత, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల జెండాలు, బ్యానర్లతో యాత్ర జరిగిన ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఐఐఐటి-శ్రీసిటీ మాజీ ఛైర్మన్, స్ట్రాలినిటీ సంస్థ సీఈఓ ఎం.బాలసుబ్రమణ్యం (బాలా) ముఖ్య అతిథిగా విచ్చేసి, యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. మన స్వేచ్ఛ, సమానత్వానికి చిహ్నంగా మరియు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగానికి తగిన గౌరవంగా ఈ తిరంగ యాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ చొరవను ప్రశంసించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పలు సంస్థలు, పురప్రజలు ఉమ్మడిగా చేపట్టిన ఈ తిరంగా యాత్ర, తరువాతి తరానికి ఆదర్శంగా ప్రేరణగా నిలుస్తుందని తన సందేశంలో వ్యాఖ్యానించారు. ఐఐఐటి-శ్రీసిటీ రిజిస్ట్రార్ కల్నల్ టి.ఉమాశంకర్, క్రియా విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సి.పి.సత్య శరణ్‌బీ నోవా ఎయిర్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసులు రెడ్డి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు. దేశం పట్ల శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం యొక్క గౌరవం, నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. మరియు ఇక్కడి విద్యాసంస్థలు, పరిశ్రమలు, నివాసితుల మధ్య ఐక్యతను చాటి చెబుతుంది.

# షణ్ముఖిని ఆలయ ఉత్సవానికి సర్వం సిద్ధం

## - ఆలయ అధికారి కృష్ణ నాయక్







కార్వేటినగరం :(శ్రీరంగరాజపురం) (ఆగస్టు 10)

చిత్తూరు జిల్లా, గంగాధర నాయుడు నియోజకవర్గం, కార్వేటి నగరం మండలం లోని కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీ సుబ్రమణ్య స్వామి ఆడికృతక ఉత్సవాలకు,ఆలయం వద్ద కూటమి నాయకుల సంఘీభావంతో పాటు ఆలయ అధికారి కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా స్వామి వారి వాల్ పోస్టర్లను మరియు కరపత్రాలను విడుదల చేయడం చేశారు.శ్రీ శ్రీ శ్రీ సుబ్రమణ్య స్వామి వారి ఉత్సవాలు ఈనెల ఆగస్టు 14 వ తారీకున అంకురార్పణం మరియు ధ్వజరోహణంతో ప్రారంభమై, 15 -16 -17- 18 తేదీలలో భరణి, ఆడికృత్తిక మహా కుంభాభిషేకం, తెప్పోత్సవం, గ్రామోత్సవం దృశ్య శోభనోపేతంగా నిర్వహించడం జరుగుతుంది. సుందరమైన ప్రదేశంలో శిఖరం పై వెలసిన స్వామి వారు ఆలయం మరో తిరుత్తనిగా పేరుగాంచిన ఈ ఆలయానికి ఈ సంవత్సరం ప్రత్యేకంగా ప్రభుత్వ సెలవులు ఉండడంతో వచ్చే భక్తుల సంఖ్య దాదాపుగా పాతిక వేల నుండి 30 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్న కారణంగా దానికి తగిన విధంగా కట్టు దిట్టమైన ఏర్పాట్లు, వసతులు మరియు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని ఆలయ కమిటీ మరియు ఆలయ అధికారి కృష్ణ నాయక్ తెలిపారు.

# ఘనంగా గంగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని కంచన పుత్తూరు గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ గంగమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఆదివారం సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న తర్వాత ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గ్రామదేవత శ్రీ గంగమ్మ తల్లి ఆశీస్సులతో ఈ గ్రామం, నియోజకవర్గ , రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అభివృద్ధి వైపు నడవాలని ప్రతి కుటుంబానికి మేలు జరగాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు,



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,

రాయచోటి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సారథ్యం పర్యటనలో భాగంగా రాయచోటిలో మాధవ్ ని కలసిన కోలా ఆనంద్, శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా పట్టణ యువమోర్చా అధ్యక్షుడు తానికొండ్ల భరత్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి సిద్దు రాయల్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గిరిదర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ క్రీడాకారులకు బహుమతులు



ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 10

మండలం లోనినరసాపురం ఎం.వి.ఆర్.ఆర్ పాఠశాల నందు మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో 8వ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ టిడిపి నాయకులు ఈదూరు చెన్నయ్య మరియు టిడిపి నాయకులు తుమ్మలపెంట హరి విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ముఖ్య అతిథులను సన్మానించారు. అనంతరం టిడిపి మండల కార్యదర్శి ఈదురు వినోద్ మాట్లాడుతూ యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా క్రీడలలో రాణించాలన్నారు. యువతను ప్రోత్సహిస్తూ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్గనైజర్ నరేష్ సురేష్ ను ఆయన అభినందించారు. ప్రతి గ్రామంలోనీ యువత ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు

# 1991బి1992 నరసాపురం పూర్వ విద్యార్థుల ఆదర్శ నిర్ణయం



ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 10

మండలంలోని ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ముదివర్తి పాలెం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లో 1991 -1992 విద్యార్థులు సరికొత్త ఆలోచనతో వినుతనమైన నిర్ణయం తీసుకున్నారు . వారు సుమారు 30 మంది విద్యార్థులు కలిసి లక్ష రూపాయలు సేకరించి దానితో వచ్చిన వడ్డీతో ప్రతి సంవత్సరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ముదివర్తిపాలెం లో పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థినికి ఇచ్చేందుకు ముందుకు వచ్చి సంతోషం వ్యక్తపరిచారు, అప్పటి అవసరాన్ని బట్టి ఇంకా ఏదైనా అవసరం అయితే ఆలోచిస్తామని చెప్పారు. అదేవిధంగా 30 మంది విద్యార్థులలో ఎవరైనా ఆపదలో ఉన్న, వారి కుటుంబం పరంగా ఏదైనా ఇబ్బందులు ఏదైనా అందరం కలిసికట్టుగా ఉండి వారి అభివృద్ధికి ఎదుగుదలకు సహకరిస్తామని, ఇది 1991- 1992 విద్యార్థులు కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయము అని తెలియజేశారు.

# సామాజిక సమరసతా సమావేశం



నెల్లూరు స్వర్ణ సాగరంఆగస్టు 10

నెల్లూరు జిల్లా సామాజికసమరసతా సమావేశం ఆదివారం నెల్లూరు జయభారత్ వైద్యశాలలో నిర్వహించారుసామాజిక సమరసతావేదిక రాష్ట్ర బాధ్యులు కోడూరు సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలోఈనెల 24న విజయవాడలో నిర్వహించు మహిళా సమ్మేళనం అదేవిధంగా ఈనెల 31 ఆదివారం నెల్లూరులో ఉప కులాల ఐక్యతాసమావేశం తో పాటుపలు నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో వేదిక జిల్లా నేతపోలయ్యప్రధాన కార్యదర్శి గోళ్ళ కేశవులుసమరసతా వేదికమహిళా నేతలు నాయకులు పాల్గొన్నారు

# సత్యవేడు సమన్వయకర్త సుడిగాలి పర్యటన



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రి

మండల కేంద్రంలోని గాజుల పెళ్లూరు, కంచన పుత్తూరు, నెలవాయి, కాంపాలెం, వేణుగోపాలపురం గ్రామపంచాయతీలో సత్యవేడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నూక తోటి రాజేష్ మండల అధ్యక్షుడు మణి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం సుడిగాలి పర్యటన పర్యటన కార్యక్రమం చేపట్టారు. రీకాలింగ్ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టారు. అనంతరం కంచన పుత్తూరు గ్రామ పంచాయితీలో నూతనంగా విగ్రహ ప్రతిష్ట చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోవు ఎన్నికలలో జగనన్న అధిక మెజారిటీతో గెలుపొందాలని, గంగమ్మ ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

ఏర్పేడు-స్వర్ణసాగరం ఆగస్టు 10



ఏర్పేడు వెంకటగిరి -ఏర్పేడు ఎన్ హెచ్ హైవే మార్గంలో దుర్గపేరి- కృష్ణంపల్లి మధ్యగల బస్ స్టాప్ నందు ఈరోజు ఉదయం శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి దళితవాడకు చెందిన నవీన్ తమ విధి నిర్వహణలో భాగంగా సుమారు తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో తమ సొంత ఊరు నుంచి తంసప్ ఫ్యాక్టరీకి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నవీన్ మృతిదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. మృతుడి తల్లిదండ్రులు బంధువుల రోదనలతో ఆ ప్రదేశం విషాదంగా మారింది. నవీన్ అవివాహితుడు సుమారు 25 సంవత్సరాలు ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు.

# తొట్టంబేడు మండలం సింగిల్ విండో చైర్మన్ భీమాల్ భాస్కర్ ముదిరాజ్ కి శుభాకాంక్షలు,



స్వర్ణ సాగరం- తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం సింగిల్ విండో చైర్మన్ భీమాల్ భాస్కర్ ముదిరాజ్ కి శుభాకాంక్షలు. ప్రజా సేవలో కృషి చేస్తూ, వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న భాస్కర్ కి స్థానికులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడదాం డాక్టర్ సునీల్



పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 10

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం అని వైఎస్ఆర్సిపి పూతలపట్టు నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ సునీల్ అన్నారు ఆదివారం పి కొత్తకోట శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపం నందు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలం హామీల అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం వైయస్ఆర్సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు అనంతరం గోడపత్రికలు విడుదల చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లిబాబు రెడ్డి కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి నంగా రాజరత్నం రెడ్డి మహిళా నాయకురాలు గౌహతి సుబ్బారెడ్డి మాజీ సింగల్ విండో అధ్యక్షులు జై చంద్ర రెడ్డి అమర్నాథ్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఘోర రోడ్డు ప్రమాదం

**రెండు బైకులు ఢీకొని ఇద్దరు**
**అక్కడికక్కడే మృతి... ముగ్గురపు గాయాలు...**





స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 09.

చిట్టమూరు మండలం యాక్సెసరీ సమీపంలో మల్లం నాయుడుపేట రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది.మృతులు పెళ్లకూరు మండలం పన్నేపల్లి గ్రామానికి చెందిన కోవూరు.వెంకటరమణ(42), వాకాడుకు చెందిన కిరణ్ (28) గా గుర్తించారు. వెంకట రమణయ్య భార్య పిల్లలతో గొట్టిప్రోలు గ్రామానికి వచ్చి తిరిగి పున్నేపల్లి వెళుతున్న క్రమంలో వాకాడుకు చెందిన కిరణ్ నాయుడుపేట నుంచి వాకాడు వైపు వెళ్తూ వెంకటరమణయ్య బైకు ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వెంకట రమణయ్య కిరణ్ ఇద్దరు మృతి చెందారు గాయపడిన.మృతులను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను నాయుడుపేటలోని ట్రినిటీ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం తరలించిన చిట్టమూరు పోలీసులు అప్పగించారు.

# తోతాపూర్ మామిడికి 12 రూపాయలు చెల్లించాల్సిందే..

**చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం.**





బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 10

తోతపురి మామిడి కి 12 రూపాయలు. చెల్లించాల్సిందే అని చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి రైతులంటే అందరికీ చిన్న చూపు అని మనలో ఐక్యత లేదని ఉద్యమ స్ఫూర్తి తక్కువే అని చులకన భావం అయితే రైతుల్లో సైతం తిరుగుబాటు ఉంటుందని వారి సహనాన్ని పరీక్షించకూడదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక తీసుకురావడంతో కనీస గిట్టుబాటు ధర కిలోకు 12 రూపాయలు ప్రభుత్వం నిర్ణయించిందని. ప్రభుత్వం నుండి 260 కోట్ల రూపాయలు రైతులకు నాలుగు రూపాయలు చొప్పున విడుదల చేసిందని ఫ్యాక్టరీ యజమానులు ర్యాంపులు నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాల మేరకు. కిలోకు ఎనిమిది రూపాయలు చెల్లించడానికి నిరాకరిస్తున్నారని ఫ్యాక్టరీలో ఐదు నుంచి ఆరు రూపాయలు చెల్లిస్తే ర్యాంపులు మరి అన్యాయంగా రెండు రూపాయలు నుండి నాలుగు రూపాయలు మాత్రమే జమ చేస్తున్నారని ఫ్యాక్టరీ యజమానులు సక్రమంగా పర్మిట్లు అందజేసి ఉంటే ర్యాంపులకు మామిడికాయలు సరఫరా చేయాల్సిన అవసరం ఉండేది కాదని మామిడి కాయలు కుళ్ళిపోతున్న పరిస్థితుల్లో ట్రాక్టర్లు బాడిగా చెల్లించలేక గత్యంతరం. లేక మామిడి రైతులు ర్యాంపులకు తోలారని ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా మామిడికి కనీసం మద్దతు ధర కిలోకి 14 రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించడం సబ్సిడీతో సగం వరకు భరించేందుకు ముందుకు రావడం కొంతమంది రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా 6.5 లక్షల టన్నులు తోతాపూరి ప్రెస్సింగ్ దృష్టిలో పెట్టుకుని రూపాయలు నాలుగు చొప్పున 260 కోట్లు మంజూరు చేసిందని అయితే నేటికీ నాలుగు పాయింట్ ఐదు లక్షల టన్నులే సరఫరా అయినందువలన 80 కోట్లు మిగిలి ఉందని కేంద్రం నుంచి మరో నూరు కోట్లు సహాయం అందుతుందని కనుక ప్రభుత్వానికి 73 ఫ్యాక్టరీ, ర్యాంపుల వారు రైతులపైన అభిమానం ఉంటే ఆ మిగులు మొత్తము నుండి రైతులకు సహాయం చేయవచ్చు అని రైతులకు 12 రూపాయలు చొప్పున అందజేసిన ప్రభుత్వానికి. అదనపు భారం పడదని కొద్దిమందిగా ఉన్న ఫ్యాక్టరీలు రాంపుల వారి ప్రయోజనాల కోసం వేలాది మంది రైతులను ప్రభుత్వం విస్మరించబో దని జిల్లా లోని మామిడి రైతులు భావిస్తున్నారు ఒకవేళ ప్రభుత్వానికి వారి ప్రయోజనాలు కూడా ముఖ్యమనుకుంటే ధర 12 చొప్పున 4.5 లక్షలకు గాను 540 కోట్లు రైతుల అకౌంట్లో ప్రభుత్వం జమ చేయాలని వారు డిమాండ్ చేశారు ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావ డానికి. ఆగస్టు 4 నుండి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మామిడి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి 50 వేల మంది రైతుల నుండి సంతకాలు సేకరించాలని తదుపరి కార్యక్రమంలో 13.8.2025 వ తేదీ బుధవారం చిత్తూరు మార్కెట్ యార్డ్ నుండి వందలాది మంది రైతులతో గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయాలని ఆగస్టు మూడవ వారంలో ముఖ్యమంత్రికి 50 వేల మామిడి సంతకాలు సమర్పించి నేరుగా కలిసి చిత్తూరు జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని మామిడి రైతుల బాధలు విన్నవించడం జరుగుతుందని చివరి వేలాదిమంది తో చిత్తూర్ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని కౌన్సిల్ సమావేశం నిర్ణయించిందని ఈ కార్యక్రమాలని జిల్లాలోని మామిడి రైతులు విజయవంతం చేయాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం కోరింది.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆనంద నాయుడు, జనరల్ సెక్రెటరీ హరిబాబు చౌదరి, మండల రైతు సంఘ అధ్యక్షులు నేతాజీ నాయుడు, తవణంపల్లి బి ఓ డి నెంబర్ టీకే చంద్రమౌళి, జై చంద్ర నాయుడు,బి లోకనాథ నాయుడు,శ్రీనివాస నాయుడు,వరదరాజులు, నాగరాజు,ఢిల్లీ రాజు,టి రాజేంద్ర నాయుడు జిల్లా లోని మామిడి రైతులు పాల్గొన్నారు

# బుసా నాగరాజు ఆధ్వర్యంలో గీత కార్మికులు సంబరాలు





బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 10

కూటమి ప్రభుత్వం గీత కార్మికులకు మద్యం షాపులు , బార్లలో 10% రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం ఈడిగ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస్స నాగరాజు ఆధ్వర్యంలో గీత కార్మికులు సంబరాలు చేసుకున్నారు.. ఈ సందర్భంగా

కాణిపాకం ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ..అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు... ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ ఈడిగా బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస్సా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చిత్తూరు జిల్లాలో నిర్వహించిన యువ గళం పాదయాత్రలో బంగారుపాళ్యం మండలం వజ్రాల పురం గ్రామం లో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే గీత కార్మికుల సంక్షేమానికి హామీ ఇచ్చారన్నారు ఇందులో భాగంగా క్యాబినెట్ మీటింగ్ లో గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపు, బార్లలో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం ఆనందకరంగా ఉందన్నారు అలాగే ఆదరణ పథకం ద్వారా గతంలో సైకిల్ పంపిణీ చేశారని .. ప్రస్తుతం మోటార్ సైకిల్ కూడా పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు... గీత కార్మికులు అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషిని ఆయన అభినందిస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు,

ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడు , బంగారుపాళ్యం మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, ధరణి ప్రసాద్, పూతలపట్టు మండలం అధ్యక్షులు దొరబాబు, ఐరాల వై మండల అధ్యక్షుడు హరిబాబు, తవణంపల్లి మండలం అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, యాదమరి మండలం అధ్యక్షుడు మొరార్జీ , కానిపాకం మాజీ చైర్మన్ మణి నాయుడు , మధుసూదన్ , ఈడిగా గౌడ సంఘం నాయకులు కృష్ణమూర్తి గౌడు , తుమ్మల గోపి గౌడ్,జనార్దన్ గౌడ్ ,నీరజాక్షులు గౌడు, రెడ్డప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రభోజ 5002వ ప్రదర్శనకు అభినందించిన డా.షేక్ ఫరీద్ బాబా



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 10

కళలకు వన్నెతెస్తూ కళాకారులను ప్రోత్సహిస్తూ, కనుమరుగవుతున్న నాటక రంగాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ను ఆరంభించి, నాటిక, నాటకాల పోటీలను నిర్వహిస్తూన్న నవయుగ కళాభోజుడు కోనేటి సుబ్బరాజు. నాటిక, నాటక రచయిత, సంగీత దర్శకుడు, రంగస్థల నటుడు, నిర్దేశకుడు. ఇతను బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎంతో పేరు, ప్రఖ్యాతి, గుర్తింపును తన సొంతం చేసుకున్నారు. కళారంగ సేవలో తాను ఇతోధికంగా నష్టపోతున్నప్పటికీ తనను నమ్మిన కళాకారులు, తాను అమితంగా ప్రేమించే నాటక రంగానికి అంతరాయం కలగకుండా, కళాకారులకూ కష్టం, నష్టం రాకుండా ఆదుకుంటున్న కళామతల్లి ముద్దుబిడ్డ కోనేటి సుబ్బరాజు. ఈయన నాటక రంగానికి ఓ వైపు ఉత్తమ కళాకారులను అందిస్తూ, మరో వైపు ఔత్సాహిక కళాకారులనూ పరిచయం చేస్తూ, ప్రోత్సహిస్తున్న మహోన్నత పోషకుడు. తన సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ద్వారా జాతీయ స్థాయిలో 5001 ప్రదర్శనలు పూర్తి చేసారంటే అది అతిశయోక్తి కాదు. దాని వెనుక అతని శ్రమ, కృషి, పట్టుదలకు ఓ నిదర్శనం. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నేడు ఆయన శ్రీకృష్ణ దేవరాయలుగా అహో ఆంధ్రభోజా నాటకంతో 5002వ ప్రదర్శన ఇవ్వనున్న నేటి తరం సార్వభౌముడు కోనేటి సుబ్బరాయుడు అంతర్జాతీయ స్థాయి లోనూ తాను తన కళలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రేమాభిమానాన్ని చూరగొనాలని ఎంఏ జబ్బార్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కళాపోషకుడు, సామాజిక సేవకుడైన డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, మనసారా కోరుకుంటూ ఆ కలియుగ వేంకటేశ్వరుడు మీకు సర్వ శక్తులూ ప్రసాదించాలని ప్రార్థించారు. అలాగే ఈ నాటకం రక్తికట్టడానికి అన్ని విధాలా తమ వంతు సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ సురభి నాటక సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. వారి సహకారం మున్ముందు ఇదే విధంగా కొనసాగాలని ఆశించారు. ఈ కార్యక్రమ సభాధ్యక్షులు, తిరుపతి హోటల్ తాజ్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణ రెడ్డి, ముఖ్య అతిథులు, తిరుపతి మాజీ శాసన సభ్యురాలు మన్నూరు సుగుణమ్మ, తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్అఫీషియో సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు శ్రీయుత సైకం జయచంద్రారెడ్డి, తిరుపతి మాజీ శాసనసభ్యులు అంతరాజి మోహన్, విశిష్ట అతిథులు, తిరుపతి జిల్లా బిజెపి నాయకులు గుండాల గోపినాథ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శింగంశెట్టి సుబ్బరామయ్య, గౌరవ అతిథులు, బిజెపి నాయకులు పి.నవీన్ కుమార్ రెడ్డి, తిరుపతి బై ఎన్ సేవ్ ప్రొప్రైటర్ మధు, టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షులు ఆర్. కిషోర్ కుమార్ అందరికీ హృదయపూర్వక ఆహ్వానించినట్టు తెలిపారు. తిరుపతి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు దేశ, విదేశాల్లోనూ అవకాశాలు పొందాలని అవి దేశ విదేశాల ఖ్యాతి పొందాలన డాక్టర్ ఫరీద్ బాబా కోరుకున్నారు.

# పేట లో గంజాయి, మద్యం మత్తులో రెచ్చిపోతున్న యువత..!

### మద్యం మత్తులో మహిళా పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకులు .....?

### విద్యార్థి జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి వ్యాపారస్తులు....

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 09.

నాయుడుపేట పట్టణంలో రోజు రోజుకు గంజాయి, మద్యం మత్తులో యువకులు రెచ్చిపోతున్నారు.

ప్రస గత కొంతకాలంగా నాయుడుపేట లో యువకులు బైక్ రేసింగ్ తో పాటు గంజాయి, మద్యం మత్తులో రాత్రులు పాత బస్టాండ్, ఆర్ టి సి బస్టాండ్, బేరిపేట, పడమట విధిలో విచ్చలవిడిగా మహిళలు,పాదచారులు పై దాడులు చేసేరు.రాజగోపాలపురం లోని విధుల్లో చీకటి పడితే ప్రభుత్వ పాఠశాల లో మద్యం సేవించడం బైక్ రేసింగ్ తో ప్రజలను భయబ్రాంత్రులు చేస్తున్నారు. సాయంత్రం మహిళలు, చిన్న పిల్లల తో కలిసి రోడ్డు పై ఆటలాడుకుంటున్న సమయంలో అతివేగంగా బైక్ నడుపుతుండతో వివాదం కూడ జరిగింది.ఈ క్రమంలో నాయుడుపేట ఉన్న ముఖ్య ప్రాంతాలలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల లో ఉన్న ఒక ప్రవేట్ పాఠశాల ప్రాంగణం లో ఫూల్ గా మద్యం సేవించి అదే మార్గంలో పోతున్న విద్యార్థులపై మహిళలపై విరుచుకుపడుతున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిపై పోలీసులు తనదైన శైలిలో కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ప్రజలు కోరుతున్నారు.




# అయ్యప్ప భక్తుల ఆధ్యాత్మికతను పెంపొందిస్తా కృష్ణంరాజు

### మండల ప్రచార కార్యదర్శిగా నియమితులైన కృష్ణంరాజు

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 10



అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రేణిగుంట మండల ప్రచార కార్యదర్శిగా మండలంలోని గాజులమండ్యం కాలనికి చెందిన కృష్ణంరాజు సోమవారం నియామకమయ్యారు. మండలంలోని మామండూరు గ్రామంలోని ఆదివారం రాములవారి గుడి వద్ద అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు ముని శంకర్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గాజుల మండలం కాలనీకి చెందిన కృష్ణంరాజును అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మండల ప్రచార కార్యదర్శిగా నియమస్తునట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ... అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం, ధర్మ ప్రచారం చేస్తానని అన్నారు. సామాజిక సేవ చేయడం అయ్యప్ప భక్తుల మధ్య ఐక్యత కోసం పని చేస్తానని, భక్తుల ఆధ్యాత్మికతను పెంపొందించి వారి నైతిక విలువలను అభివృద్ధి చేసే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. మండల ప్రచార కార్యదర్శిగా నియమించినందుకు జిల్లా సమన్వయకర్త మునిరాజాకు, జిల్లా గౌరవ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రచార కార్యదర్శి కి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చికెన్ దుకాణం తూకంలో మోసం కేసు నమోదు

వరదయ్య పాలెం స్వర్ణ సాగరం ఆగస్టు 10



వరదయ్యపాళెం మండలం వరదయ్య పాలెం పంచాయతీ గోవర్ధనపురంలో ఓ చికెన్ దుకాణంపై జిల్లా తూనికలు, కొలతల అధికారి ఆకస్మిక దాడులు చేపట్టి తూకంలో మోసాన్ని గుర్తించారు. ఆదివారం జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్స్పెక్టరు జి.ప్రసాద్ ఆధ్వర్యంలో గోవర్ధనపురంలోని ప్రశాంత్ చికెన్ దుకాణంలో తూనికపు డిజిటల్ యంత్రాన్ని తనిఖీ చేశారు.అయిదు కిలోలకు 750 గ్రామాలు అధికంగా చూపడంతో యజమాని మునిపై కేసు నమోదు చేశారు. ఇదే దుకాణంలో గతంలో సైతం మూడు పర్యాయాలు దాడులు చేసి కేసు నమోదు చేసినట్లు తూనికల అధికారి ప్రసాద్ తెలిపారు తూనికలల్లో వ్యత్యాసం చూపి ప్రజలను మోసం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# దొంగతనం కేసులో నలుగురు అరెస్టు





స్వర్ణ సాగరం నాగలాపురం ఆగస్టు 10 :

నాగలాపురం పట్టణంలో బంగారు దుఖనంలో చైను దొంగతనం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ తెలిపారు.జూలై 19 వ తేదీ నాగలాపురం బజారు వీధిలోని మహావీర్ బంగారు దుఖనంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలుకు వచ్చినట్లు వచ్చి 12 గ్రాములు విలువ గల చైన్ అపహరించుకుని వెళ్ళారు. బాదితుదారుడు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,సీసీ కెమెరా దృశ్యాలు ఆధారంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక బైపాసు వద్ద వాహనాలు తనిఖీ చేసుండగా పైకేసుకు సంబందపడిన ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి బంగారు చైను, కార్లను స్వాదీనం చేసుకున్నామని అన్నారు.ఈ మేరకు నిందితులైన చింతలపల్లి పంచాయతీ,వాయల్పాడు మండలం,అన్నమయ్య జిల్లాకు చెందిన వేముల జ్యోతి (35),భర్త వేముల నరేష్ (37),వేముల నరసమ్మ (35),భర్త వేముల తిమ్మయ్య (36) ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు.నాగలాపురం పోలీసులను స్థానికులు,వ్యాపారస్తులు అభినందించారు.ఎస్ఐ సునీల్ తోపాటు శిక్షణ ఎస్ఐ ప్రసాద్,కానిస్టేబల్ సాయికృష్ణ,భాస్కర్ హొంగార్డ్ ఈశ్వర్, దేశమ్ము ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

స్వర్ణ సాగరం నాగలాపురం ఆగస్టు 10 :



నాగలాపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002-03 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్లో లో ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్న వారందరు హాజరయ్యారు.అనంతరం పూర్వ విధ్యార్థులు తాము చదువుకుంటున్నప్పుడు జరిగినటు వంటి తీపి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులందరిని ఘనంగా శాలువ కప్పి సన్మానించి బహుమతి ప్రధానం చేశారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను భోదించిన ఉపాధ్యాయులకు సన్మానించడంతో పాటు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు బ్యూలా,నగరి మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి,ఉపాధ్యాయులు,ధరణి, నీలకంఠం,జయపాల్,రాంబాబు, విజ్ఞానసుధ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వ్యవస్థాపకులు ఏ.హేమ కుమార్,పూర్వ విద్యార్థులు ఉదయ్ కుమార్,భారతి రాజ,అశోక్,దేవేంద్ర,సుమలత, గౌతమి,ముని చంద్ర,శిల్ప,హరీష్, తదితలి విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటి ఇంటికి మాధవన్ సారధ్యం యాత్ర కరపత్రాలు పంపిణీ

### 12న సభను విజయవంతం చేయండీ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు




రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 10

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారథ్యం యాత్ర సభ ను విజయవంతం చేయడం కోసం జిల్లా ఉపాధ్యక్షులు, రేణిగుంట మండల ఇంచార్జ్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, అధ్యక్షులు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు జీపాలెం తేజోవతిల నాయకత్వంలో రేణిగుంట మండలం నందు వివిధ ప్రాంతాల్లో ఇంటి ఇంటికి వెళ్లి సారథ్యం కరపత్రాలను ఇచ్చి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులను వ్యక్తంగా కలసి ఆప్యాయతగా ఆహ్వానం చేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షులు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ సారథ్యం ర్యాలీ, సభను విజయవంతం చేయాలని ఇంటింటా ఆహ్వానించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజెపి నాయకులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, జీపాలెం తేజోవతి, జీపాలెం కృష్ణా రెడ్డి, కండ్రిగ యాతీంద్ర రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సముచిత స్థానం

### సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 10.



పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించే విధంగా అధిష్టానం చర్యలు చేపట్టడం జరుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్ నాయకులు కొండేపాటి గంగప్రసాద్ లతో కలసి ఓజిలి, పెళ్ళకూరు, నాయుడుపేట మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ అగ్ర నాయకులు కొండేపాటి గంగప్రసాద్, మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు శిరసనం బేటి విజయభాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ రెడ్డి, సంచి కిష్టయ్య, పసల గంగా ప్రసాద్ ,కురుగొండ సొసైటీ నూతన అధ్యక్షులు డాక్టర్ దార అంకయ్య, కుందం సొసైటీ నూతన అధ్యక్షులు గుంటమడుగు పురుషోత్తం రాజు, పేరం రమేష్ నాయుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ముసునూరు శ్రీనివాసులు, బచ్చుల రవీంద్రారెడ్డి, అమరేంద్ర యాదవ్,సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కమలాకర్ , తెలుగుదేశం పార్టీ నాయకురాలు బందిలి లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# మణి కుమార్తె వివాహ విందుకు టిడిపి కుటుంబ సభ్యుల హాజరు,



స్వర్ణ సాగరం- తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం మణి కుమార్తె వివాహానంతరం, ఈ రోజు వారు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి పలువురు టిడిపి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో విందు సాగింది.

# ఉచిత హెల్త్ కార్డులు పంపిణీ

### జయభారత్ హాస్పిటల్ సౌజన్యంతో

నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 10



సింహపురిసేవాసమితి సహకారం తో, జయభారత్ హాస్పిటల్ వారి ఉచిత హెల్త్ కార్డులు కోవూరు మండలం లోని వేగురు రామాపురం, వేగురు సాలూచింతల, సీత రామ పురం గిరిజన కాలనీలలో 500 గిరిజన కుటుంబాలకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా పాల్గొన్న యానాధుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ సింహపురి వైద్య సేవాసమితి గిరిజనులకు ఉచిత వైద్యంతో పాటు, గిరిజన బాలబాలికలకు ప్రతి గిరిజన కాలనీలలో బాలసంస్కార సాయంబడులు ఏర్పాటుచేసి తెలుగు అక్షరములు రాయడం చదవడం నేర్పటం తో పాటు దేశ భక్తి గీతాలు, చిన్నచిన్న ఆటలు నేర్పుతు గిరిజన బాలబాలికలకు చైతన్యం కలిగిస్తున్నారని, బాలబాలికల తల్లితండ్రులు పిల్లలను సాయం బడి కేంద్రాలకు పంపాలని అవగాహన కలిగించారు. విద్య ద్వారానే జాతి అభివృద్ధి అవుతుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మోపురు వెంకటేశ్వర్లు, తిరివీధి వెంకటలక్ష్మి,స్రవంతి, సింధు ప్రియ, ఈగా మహేష్ తదితరులు పాల్గొన్నారు




# పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ రెడీనా? క్లాప్ బోర్డుతో ఉస్తాద్ భగత్ సింగ్ మేకర్స్ స్టన్నింగ్ వార్త

పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ షూటింగ్స్‌పై ఫోకస్ పెట్టాడని తెలిసిందే. ప్రస్తుతం హరిహరవీరమల్లు పార్టు 2, ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ ఈ స్టార్ యాక్టర్ లైన్‌లో ఉన్నాయి. వీటిలో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టు ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అయితే కార్మిక సంఘాల వేతనాల పెంపు డిమాండ్స్‌తో షూటింగ్స్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడ్డ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమాల అప్‌డేట్స్ విషయంలో నిరాశలో ఉన్న మూవీ లవర్స్, అభిమానులకు అదిరిపోయే న్యూస్ షేర్ చేశారు మేకర్స్. బిగ్ స్క్రీన్స్‌పై అందరి ప్రశంసలు, చప్పట్లు అందుకోవడానికి క్లాప్ బోర్డు షాట్స్‌ను తొలగిస్తున్నాం. ఉస్తాద్ భగత్ సింగ్ ఎడిటింగ్ జెట్ స్పీడులో కొనసాగుతోంది. హరీష్ శంకర్ మీ అందరికి విజువల్ ఫీస్ట్‌లా అనిపించేలా పవర్ స్టార్‌ను నయా అవతార్‌లో చూపించబోతున్నాడు.. అంటూ క్లాప్ బోర్డు స్క్రీన్ షాట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఇప్పుడీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నాకీలక పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ స్టైల్ ఆఫ్ మ్యానరిజంతో సాగుతున్న డైలాగ్స్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి.



# ఏలుమలై నుంచి ఎమోషనల్ టచ్‌తో మంగ్లీ కాపాడు దేవా సాంగ్

హీరోయిన్ రక్షిత సోదరుడు రాన్నా హీరోగా డెబ్యూ ఇస్తోన్న చిత్రం ఏలుమలై ప్రియాంక ఆచార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. జగపతిబాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. పునీత్ రంగస్వామి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ నుంచి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ మూవీ నుంచి కాపాడు దేవా సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. పాపులర్ సింగర్ మంగ్లీ వాయిస్‌తో సాగుతున్న ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. డి ఇమ్మాన్ కంపోజిషన్‌లో మంగ్లీ పాడిన ఈ సాంగ్ హీరోహీరోయిన్ల మధ్య సాగే ట్రాక్‌తో ఎమోషనల్‌గా సాగుతోంది. సినిమా ఎలా ఉండబోతుందనే థీమ్‌ను పాట ద్వారా హింట్ ఇచ్చేసి సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు మేకర్స్. కర్ణాటక, తమిళనాడు సరిహద్దులోని చామరాజనగర్, సేలం, ఈరోడ్ లాంటి ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ఒకేసారి రిలీజ్ కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నరసింహ నాయక్ సమర్పణలో తరుణ్ సుధీర్ క్రియేషన్స్, డీఈ ఆర్ట్ స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# బీచ్‌లో హాట్‌గా, స్టైలిష్‌గా డీజే టిల్లు భామ.. ఇంతకీ ఎక్కడికెళ్లిందబ్బా..?

డీజే టిల్లు సినిమాలో రాధికా పాత్రతో సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసింది నేహా శెట్టి. ఈ సినిమాతో సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న నేహాశెట్టి చివరగా విశ్వక్ సేన్ నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రంలో నటించింది. కాగా ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌ను పక్కన పెట్టేసి సరదాగా షికారు చేసే పనిలో పడింది టిల్లు భామ. సముద్ర తీరంలో విహరిస్తూ బీచ్ అందాలను ఆస్వాదిస్తూ సేద తీరుతుంది. ఇంతకీ ఈ బ్యూటీ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రదేశం మాల్దీవులకు వెళ్లింది నేహాశెట్టి. బీచ్‌లో బికినీలో ఓ వైపు ఎంజాయ్ చేస్తూనే.. మరోవైపు స్టైలిష్ అవుట్‌ఫిట్స్‌లో మెరిసింది. ఇప్పుడీ స్టిల్స్, వీడియోలు నెట్టింట రౌండప్ చేస్తూ కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత మరే సినిమాకు సైన్ చేయలేదు.

# రివ్యూస్ బాగుంటేనే సినిమా చూడండి: పరదా డైరెక్టర్

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న లేడీ ఓరియంటెడ్ చిత్రం 'పరదా'. ఈ సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీని విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించారు. తాజాగా హైదరాబాద్‌లో ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు హాజరైన దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఆసక్తికర కామెంట్స్ చేశారు. సినిమా రివ్యూలు నచ్చితేనే పరదా మూవీ చూడాలని అన్నారు. ఈ చిత్రంలో దర్శన రాజేంద్రన్, సంగీత ముఖ్య పాత్రలు పోషించారు. ప్రవీణ్ మాట్లాడుతూ.. 'నా రెండు సినిమాలు శుభం, సినిమా బండి ఒక జోనర్ చిత్రాలు. కానీ ఈ సినిమా నాకు పర్సనల్‌గా బిగ్ స్కేల్ ఫిల్మ్. వీడు చిన్న సినిమాలు చేస్తు బతికేస్తాడులే అందరు అనుకుంటారు. కానీ ముగ్గురు స్టార్స్‌తో పక్కా కమర్షియల్ సినిమా తీశా. ఈ చిత్రానికి మంచి పేరు తప్పకుండా వస్తుంది. కానీ పేరు ముఖ్యం కాదు.. డబ్బులు రావాలి. ఇలా జరిగితే ఇలాంటి కంటెంట్ సినిమాలు తీసేందుకు నిర్మాతలు రెడీగా ఉన్నారు. అనుపమకు ఇదొక పెద్ద సోలో ఫిల్మ్. అనుష్కకు అరుంధతిలాగే అనుపమకు కూడా ఒక్క ఛాన్స్ ఇవ్వండి. ఇది తనకు చాలా ఫేవరేట్ మూవీ. థియేటర్లకు వెళ్లి సినిమా చూడండి. రివ్యూలు బాగుంటేనే మా చిత్రాన్ని చూడండి. ఇది నా ఛాలెంజ్' అంటూ మాట్లాడారు. కాగా.. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 22న థియేటర్లలో సందడి చేయనుంది.








# ఈసారి బిగ్‌బాస్‌నే మార్చేశారట.. 'డబుల్ హౌస్.. డబుల్ డోస్' సీజన్-9 ప్రోమో..

హైదరాబాద్: 'ఎప్పుడైనా పాత సిలబస్‌తో కొత్త ఎగ్జామ్ రాస్తావా' అంటూ వెన్నెల కిషోర్‌ను ప్రశ్నిస్తున్నారు నాగార్జున ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న తెలుగు రియాల్టీ షో 'బిగ్‌బాస్'. ఇప్పటివరకూ 8 సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో 9వ సీజన్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా స్పెషల్ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ఇందులో వెన్నెల కిషోర్ హౌస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవగా, సీజన్9లో నాగార్జున చెప్పిన కండీషన్స్ విని ఆయన ఆశ్చర్యపోయారు. 'ఈసారి డబుల్ హౌస్.. డబుల్ డోస్' అంటూ సీజన్‌పై ఆసక్తిని పెంచారు. అంతేకాదు, 'బిగ్‌బాస్‌నే మార్చేశా' అంటూ నాగార్జున ట్విస్ట్ ఇచ్చారు. సెలబ్రిటీలతో పాటు, సామాన్యులకు ఈసారి పెద్ద పీట వేయబోతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే సీజన్9 బుల్లితెర ప్రేక్షకుల ముందుకు రానుంది.